క్లుప్తంగా

వైభవం.. అనంత పద్మనాభ వ్రతం


వ్రతంలో ఆర్యవైశ్య దంపతులు

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం ఆర్యవైశ్యులు సామూహికంగా శ్రీఅనంతపద్మనాభస్వామి వ్రతం చేశారు. అర్చకులు రామక్రిష్ణమాచార్యులు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఆర్యవైశ్య దంపతులు వ్రతాన్ని ఆచరించారు. వ్రత ప్రాముఖ్యతను అర్చకులు వివరించారు. మహిళలకు వాయనాలు సమర్పించారు.

నేత్రదానానికి ముందుకు రావాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

సదుం: నేత్ర దానానికి అందరూ మొగ్గు చూపాలని సామాజిక వైద్యశాల డాక్టర్ పుష్ప కుమారి తెలిపారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని శనివారం నేత్ర దానంపై అవగాహన కల్పించారు. నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరి అంధులకు చూపు వచ్చే అవకాశం ఉందన్నారు. మృతిచెందిన అనంతరం చేసే నేత్రదానం వల్ల ఎటువంటి నష్టం ఉండదని వివరించారు. కార్యక్రమంలో నేత్ర నిపుణుడు నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మావతి

బైరెడ్డిపల్లె: ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పద్మావతి అన్నారు. కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ప్రిన్సిపల్ సుమిత్ర, ఎమ్ఎల్‌హెచ్‌పీ సాయి దివ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎం రుద్రాణికి సన్మానం


రుద్రాణిని సన్మానిస్తున్న లయన్స్ ప్రతినిధులు

పుంగనూరు: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రుద్రాణిని శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆమెతో పాటు ఉపాధ్యాయులను సన్మానించారు. ఇటీవల ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆమెను లయన్స్‌క్లబ్ సభ్యులు సత్కరించారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాల పెంపునకు కృషి


ఎంఈఓలు కేశవరెడ్డి, అవార్డు గ్రహీత ఎంఈఓ తిరుమలమ్మతో ఉపాధ్యాయులు

చౌడేపల్లె: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ సూచించారు. శనివారం చౌడేపల్లె విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలో ఉత్తమ ఎంఈఓగా అవార్డు పొందిన తిరుమలమ్మను సత్కరించారు. అలాగే ఉత్తమ అవార్డు గ్రహీత సురేష్, పదవీ విరమణ పొందిన సీనియర్ ఉపాధ్యాయులు బీఎన్ ప్రకాష్, పుష్పలత, కృష్ణారెడ్డిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు లింగమూర్తి యాదవ్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సహదేవ, సీపీఎస్ మండలాధ్యక్షురాలు వసంత ఉపాధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న దాతలు

పలమనేరు: పట్టణంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు స్థానిక మాజీ కౌన్సిలర్ కృష్ణమూర్తి కుటుంబీకులు శనివారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. పిల్లలకు అవసరమైన నోటుపుస్తకాలు, పెన్నులు, ఇతర వస్తువులు అందజేశారు. దీంతో దాతలను హాస్టల్ వార్డెన్ సోమ చంద్రారెడ్డి అభినందించారు.

జంజాటం!

- పలమనేరులో ట్రాఫిక్ సమస్య తీరేనా?
- స్కూల్, కాలేజీ బస్సులొస్తే అంతే!
- ఇన్నర్ బైపాస్‌గా బొమ్మిదొడ్డి రోడ్డును వాడుకోని వైనం
- వన్‌సైడ్ పార్కింగ్ పెట్టినా తీరని ట్రాఫిక్ సమస్య
- అవస్థల్లో స్థానికులు


మదనపల్లి రోడ్డులో ట్రాఫిక్‌లో ఆగిపోయిన స్కూల్ బస్సులు

పలమనేరు: పట్టణంలో జనాభా ఇప్పుడు 80వేలకు చేరింది. ఉన్న రోడ్లలో వాహనాల రాకపోకలు రెట్టింపు అయ్యాయి. ద్విచక్రవాహనాల వినియోగం కోవిడ్ తర్వాత భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఎప్పుడో దశాబ్దాల క్రితం రోడ్లలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం పాఠశాలలు, కళాశాలల వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉంటుంది. దీనికి శాశ్వత పరిష్కారంపై స్థానిక మున్సిపల్ అధికారులు దృష్టి సారించడం లేదనే మాట పట్టణంలో జోరుగా వినిపిస్తోంది.

ఇన్నర్ బైపాస్‌ను అభివృద్ధి చేయలేదే..

పట్టణంలోని హైవే రోడ్డుపై ఏదేని ట్రాఫిక్ సమస్య వస్తే వాహన రాకపోకలను స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని లక్ష్మీనగర్ కాలనీ, జూనియర్ కళాశాల, బొమ్మిదొడ్డి రోడ్డు ఉంది. అయితే దీనిని ఇక్కడి అధికారులు అసలు పట్టించుకోలేదు. ఈ మార్గంలో రోడ్డు దెబ్బతింది. పలుచోట్ల గుంతలు పడ్డాయి. పలు నిధుల ద్వారా మున్సిపాలిటీలో రోడ్లను వేస్తున్న అధికారులు లక్ష్మీనగర్ కాలనీ నుంచి బొమ్మిదొడ్డి మీదుగా హైవేలోని పాత పల్లె రుచులు హోటల్ దాకా ఉన్న పాత రోడ్డుపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్యకు ప్రత్యామ్నాయం లేకుండా పోతోంది.

మదనపల్లి రోడ్డులో ట్రాఫిక్ అధికం

పట్టణంలోని పద్మశ్రీ సర్కిల్ నుంచి మదనపల్లి రోడ్డులో గంగవరం దాకా ఎక్కువగా ట్రాఫిక్ ఉంటుంది. గుండుబావి నుంచి దండపల్లి రోడ్డు మీదుగా ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆర్టీఓ కార్యాలయాల మీదుగా ఉన్న ఇన్నర్ రోడ్డును కాస్త వెడల్పు చేస్తే ఈమార్గంలో ట్రాఫిక్ సమస్య కొంతైనా తీరుతుంది. కనీసం మున్సిపల్ పాలకమండలి అయినా ఈ దిశగా ఆలోచించి చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పలమనేరులోని చర్చి వద్ద స్తంభించిన ట్రాఫిక్



80 అడుగుల బ్రిటీషర్ల రోడ్డును గాలికొదిలేశారు

పట్టణంలోని కూర్మాయి రోడ్డు నుంచి ఎక్స్‌ప్రెస్ హైవే సమీపంలో మొదలయ్యే ఈ రోడ్డును గతంలో బ్రిటీష్ అధికారులు 80 అడుగుల రోడ్డుగా భవిష్యత్తులో పట్టణానికి అవుటర్ రింగ్‌రోడ్డుగా ఉంటుందని అప్పట్లోనే ఆలోచించి వేశారు. కానీ ఈ రోడ్డు ఇప్పుడు పలుచోట్ల ఆక్రమణలకు గురైంది. దీనిపై ఆలస్యంగానైనా స్పందించిన మున్సిపల్ అధికారులు గతంలో కొన్నిచోట్ల ఆక్రమణ తొలగించారు. ఈ రోడ్డును వినియోగంలోకి తీసుకొస్తే మార్గంలో పలు భారీ వాహనాలు సైతం పట్టణ ఆవాస మార్గం ద్వారా బైపాస్‌గా వెళ్లే అవకాశం ఉంటుంది.


బ్రిటీషర్ల 80 అడుగుల బైపాస్ రోడ్డు

దోపిడీదారులపై కేసు

పలమనేరు: పట్టణ ఆవాసాల్లో ఒంటరిగా వెళుతున్న వారిపై దాడిచేసి వారి వద్దనున్న నగదు, సెల్‌ఫోన్లను చోరీ చేసే వారిపై పలమనేరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఆమేరకు పట్టణ సమీపంలోని చరణ్ హోటల్ వద్ద వెళుతున్న పట్టణానికి చెందిన చాకలి గణపతిని ఓ యువకుడు దాడిచేసి అతని వద్దనున్న రూ.18వేల నగదు, సెల్‌ఫోన్‌తో ఉడాయించాడు. దీనిపై బాధితుని పిర్యాదు మేరకు పట్టణంలోని రఘువీరారెడ్డి కాలనీకి చెందిన గణేష్‌ను అరెస్ట్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. అదేవిధంగా రెండ్రోజుల క్రితం పట్టణానికి చెందిన రఫీ ఇంటికి సరుకులు తీసుకొని వెళుతుండగా నలుగురు యువకులు దాడిచేసి అతని వద్దనున్న సెల్ లాక్కొని వెళ్లారు. దీనిపై బాధితుని పిర్యాదుతో నలుగురు యువకులను శనివారం అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్టు సీఐ మురళీమోహన్ తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

చౌడేపల్లె: స్థానిక గడ్డంవారిపల్లె రోడ్డులో ఉన్న బైసాని కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.దామోదరరాజు, మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీమంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు పలువురు హాజరవుతున్నట్లు చెప్పారు. మండల కమిటీ నిర్మాణం, రచ్చబండ కార్యక్రమ అమలు అంశాలపై సమావేశం జరగనుంది. కావున ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు విధిగా హాజరు కావాలన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో తనిఖీలు


రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని శనివారం డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలిదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. అలాగే వార్డుల్లోని రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలు గురించి తెలుసుకున్నారు. డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, రోగుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెడికల్ ఆఫీసర్ మధుసూదనచారి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమావేశం


పుంగనూరు: సమావేశమైన విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగసంఘ ప్రతినిధులు, సభ్యులు

పుంగనూరు: పట్టణంలోని విద్యుత్ కాంట్రాక్ట్ ఎంపా సంఘం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో అధ్యక్షుడు అంబికేష్, ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ కలిసి ఉద్యోగులతో చర్చలు జరిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దినేష్‌కుమార్

రొంపిచెర్ల: విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు దినేష్ కుమార్ నాయక్ అన్నారు. ఆయన శనివారం రొంపిచెర్ల కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ అమ్మాణ్ణి, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి సుజాత, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోకు ఉద్యోగోన్నతి

పెద్దపంజాణి: మండలంలోని తుర్లపల్లి వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న సుబ్రమణ్యంఆచారి సీనియర్ అసిస్టెంటుగా ఉద్యోగోన్నతి పొందుతూ కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పలమనేరు రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి బదిలీ అయినట్లు ఆయన చెప్పారు. పలువురు రెవెన్యూ ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కనులపండువగా కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సదుం: మండలంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో శనివారం నాలుగో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి అభిషేకాలు, హోమం, విశేషాలంకరణ చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను మేళతాళాలతో గ్రామాల్లో ఊరేగించారు.

పంచాయతీల పురోగతిపై శిక్షణ

పుంగనూరు: పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులకు ఏఓ రెడ్డెమ్మ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ నరసింహులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


సన్మానం అందుకున్న టీచర్లు

పెద్దపంజాణి: మండలంలోని ముత్తుకూరు ప్రాథమిక పాఠశాల, అప్పినపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ముత్తుకూరు పాఠశాలలో పాఠశాల విద్యాకమిటీ, విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎంలు దాస్, సుభాషిణి, టీచర్లు గురుప్రసాద్, నారాయణస్వామి, ప్రసన్నలక్ష్మి, భారతి, శకుంతల పాల్గొన్నారు.

నేడు పుస్తకంతో నడక

పలమనేరు: అంతర్జాతీయ అక్షరాస్యతాదినోత్సవాన్ని పుష్కరించుకుని పట్టణంలో పుస్తక పఠనంపై ఆసక్తిని కలిగించేందుకు పుస్తకంతో నడక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు స్థానిక గ్రంథాలయాధికారి హేమంత్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమేరకు నేటి ఉదయం గంటపాటు పుస్తకాలను చేతబట్టి పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో పలు సాహిత్య, సాంస్కృతిక, ప్రజాసంఘాలు పాల్గొంటాయని పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి

- 19 మందికి ఏడుగురు సర్పంచులు హాజరు
- ఆర్భాటం తప్ప ఆచరణ ఎక్కడ?
- 13 మంది సర్పంచులతో పాటు పలుశాఖల అధికారులు డుమ్మా


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు

చౌడేపల్లె: ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.దామోదరరాజు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు పంచాయతీల పురోగతి సూచిక వెర్షన్ 2.ఓలో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. రానున్న ఆర్థిక సంవత్సర ప్రణాళికతో పాటు గతేడాది చేపట్టిన ప్రణాళికల్లో గల లోటుపాట్లను సవరించుకునే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ పంచాయతీల్లో అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు అందేలా చూడాలన్నారు. శిక్షణకు మండలంలో 19 మంది సర్పంచులు ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. ఎంపీటీసీలు 12 మంది ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే హాజరుకావడం అధికారుల పరిపాలనా తీరుకు నిదర్శనంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. 13 శాఖల సమన్వయంతో చేపట్టే ఈ ప్రణాళికలకు కేవలం విద్య, ఐసీడీఎస్, అగ్రికల్చర్ శాఖలు తప్ప మిగిలిన శాఖల వారు హాజరు కాకపోవడం గమనార్హం. మొక్కుబడిగా వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులతో శిక్షణ తరగతులు ముగింపు పలికేశారు. ఆర్భాటం తప్ప ఆచరణ ఎక్కడ ఉందని.. ఇలా ఉంటే ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుందని తీవ్రంగా విమర్శలకు తావిచ్చింది. సమావేశంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, కోఆప్షన్ మెంబర్ సాధిక్‌బాషా, ఎంఈఓ కేశవరెడ్డి, సూపరింటెండెంట్ షబ్బీర్ అహమ్మద్. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కోలాహలం..నిమజ్జనం



కుప్పం: పట్టణంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం శనివారం అత్యంత కోలాహలంగా సాగింది. రైల్వేస్టేషన్ సర్కిల్, మర్రిమాను వీధి, కొత్తపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను పరమసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు.

నీతి పద్యాలు దారి చూపే నేస్తాలు

బైరెడ్డిపల్లె: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి.తులసినాథంనాయుడు రచించిన నీతి పద్యాలు విద్యార్థులకు దారి చూపే నేస్తాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. కమ్మనపల్లె గురుకుల, ఆదర్శ, కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలల్లో శనివారం తులసినాథంనాయుడు రచించిన నీతి పద్యాలను విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు విద్యార్థులకు అనుగుణంగా తులసినాథంనాయుడు రచించిన పుస్తకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. నీతి పద్యాలు చదవడం వలన లోకజ్ఞానంతోపాటు మంచి అలవాట్లు వస్తాయన్నారు.

నలుగురికి జరిమానా

పెద్దపంజాణి: ఇటీవల వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు మద్యం తాగి పట్టుబడినట్లు ఎస్ఐ ధనంజయరెడ్డి తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి పుంగనూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున నలుగురికి రూ.40 వేలు జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ఆవిష్కరించిన ఎమ్మెల్సీ భరత్

కుప్పం: రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై చేపట్టనున్న అన్నదాత పోరు పోస్టర్లను ఎమ్మెల్సీ భరత్ ఆవిష్కరించారు. శనివారం ఉదయం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా యూ రియా కొరతతో రైతులు పడుతున్న బాధలకు బాసటగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని ఆయన తెలిపారు. యూరియా సహా ఎరువులను అవనీతి లేకుండా రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంటల బీమా సౌకర్యం కల్పించాలని, వర్షాల కారణంగా నష్టపోయినా రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు అండగా నిలబడి వైఎస్సార్‌సీపీ చేపడుతున్న ఉద్యమంలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హఫీజ్, మురుగేష్, కోదండరెడ్డి, రామకృష్ణ, శీను, ఈశ్వర్, విజయ్, మోహన్‌రాం పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డిని కలిసిన నేతలు


ఎంపీ మిథున్‌రెడ్డితో నేతలు

సదుం: మధ్యంతర బెయిల్‌పై విడుదలైన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం రాజమండ్రిలో కలిశారు. ఎంపీని కలిసిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, పులిచర్ల ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, పాలమంద సర్పంచ్ మనోహర్‌రెడ్డి, రమణారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ముత్తు ఉన్నారు. ఎంపీకి మధ్యంతర బెయిల్ మంజూరు కావడంపై ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గంబూషియాతో దోమల నివారణ



బొమ్మిదొడ్డి చెరువులో గంబూషియా చేపపిల్లలు, చేప పిల్లలను నీటిలో వదులుతున్న వైద్యాధికారులు

- జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

పలమనేరు: నియోజకవర్గంలోని చెరువుల్లోకి గంబూషియా చేప పిల్లలను వదిలిపెట్టే కార్యక్రమం శనివారం నుంచి మొదలైంది. ఆమేరకు పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి చెరువులో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ శనివారం చేపపిల్లలను వదిలిపెట్టారు. ఆయన మాట్లాడుతూ చెరువుల్లో వదిలిపెట్టిన ఈ చేపలు పెరిగి చెరువుల్లోని లార్వాను తిని దోమలు పెరగకుండా చేస్తాయన్నారు. స్థానిక సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ పాల్గొన్నారు.

వి.కోట: గంబుషియా చేపలతో దోమలను నివారించవచ్చని ఓగు వైద్యాధికారి సుస్మిత అన్నారు. శనివారం మండలంలోని పలు చెరువులు, ఇన్‌ఫ్యాంట్ జీసస్ స్కూల్ వద్ద గల కుంట, వి.కోట పెద్దచెరువు, కాలువలు, అబ్దుల్‌కలాం వీధిలోని బావిలో ఓగు పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో గంబూషియా చేపలను వదిలారు. ఓగు వైద్యబృందం, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్, ఆరోగ్య సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతే గురుదక్షిణ

శాంతిపురం: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలను చేరుకోవడమే గురువులకు ఇచ్చే గురుదక్షిణ అని పరమహంస యోగానంద స్కూలు ప్రిన్సిపల్ ఆజాద్‌హుసేన్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శనివారం స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయుల వేషధారణలో వచ్చి ఏకపాత్రాభినయం చేశారు. ఉపాధ్యాయులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులను తమ పిల్లలుగా భావించి ఉపాధ్యాయులు వారి జీవితాలను తీర్చిదిద్దుతారని చెప్పారు.

సన్మానం


చాంద్‌బాషాకు సన్మానం

రొంపిచెర్ల: విద్యార్థులు లేక మూత పడే పాఠశాలను నిలబడేలా చేసిన టీచర్ చాంద్‌బాషాను విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం సన్మానించారు. ఆర్.బేస్తపల్లె ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు విద్యార్థులే ఉండేవారు. ఈ స్కూల్‌కు టీచర్‌గా వచ్చిన చాంద్‌బాషా విద్యార్థులను 12కు చేర్చాడు. తల్లిదండ్రులు చాంద్‌బాషాను శనివారం సన్మానించారు. ఎంఈఓ శ్రీనివాసులు, కమిటీ చైర్మన్ శారద, బర్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.